

సాక్షి జోగులాంబ గద్వాల

ఆదివారం । 13 । జూలై । 2025



పెద్దగుట్ట ముస్తాబు
శ్రావణమాస ఉత్సవాలకు జడ్చర్లలోని పెద్దగుట్ట ముస్తాబవుతోంది.
వివరాలు 8లో ▶



.. కృష్ణమ్మ పరుగులు
ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది.
వివరాలు 8లో ▶



వాతావరణం
రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అట్టహాసంగా ముగిసిన కబడ్డీ పోటీలు



గద్వాలటౌన్‌: గద్వాల ఆతిథ్యంతో స్థానిక ఎస్‌ఆర్‌ విద్యానికేతన్‌ వేదికగా గత మూడు రోజుల పాటు జరిగిన ఉమ్మడి రాష్ట్రాల క్లస్టర్‌ సీబీఎస్‌ఈ పాఠశాలల అండర్‌ -14, 17, 19 బాలికల కబడ్డీ పోటీలు శనివారం అట్టహాసంగా ముగిశాయి. సెమీ ఫైనల్‌, ఫైనల్‌ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. అండర్‌-14 విజేతగా హైదరాబాద్‌కు మాతృశ్రీ విద్యానికేతన్‌ జట్టు, రన్నర్‌గా గద్వాలకు చెందిన ఎస్‌ఆర్‌ విద్యానికేతన్‌ జట్లు నిలిచాయి. అండర్‌-17 విజేతగా తిరుపతికు చెందిన వెరిటాస్‌ సైనిక్‌ స్కూల్‌ జట్టు, రన్నర్‌గా హైదరాబాద్‌ శాంతినికేతన్‌ జట్టు నిలిచాయి. అండర్‌-19 విజేతగా హైదరాబాద్‌ ఓబుల్‌రెడ్డి జట్టు, రన్నర్‌గా తూర్పు గోదావరికి చెందిన సిస్టర్‌ నివేదిత జట్టు నిలిచింది. ఇరుజట్ల క్రీడాకారులు ఒక వైపు క్రీడాస్ఫూర్తిని కనబరుస్తూనే మరోవైపు క్రీడాకారులు గెలుపునకు చివరిదాకా కృషి చేశారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి
ప్రతి క్రీడాకారుడికి క్రీడా స్ఫూర్తి ముఖ్యమని, దీని వల్లే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని డీఎస్పీ మొగలయ్య అన్నారు. శనివారం సాయంత్రం జరిగిన పోటీల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడల పట్టణంగా గద్వాల అభివృద్ధి చెందుతుందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రీడలు జీవితానికి గొప్ప స్ఫూర్తినిస్తాయని, అందువల్ల వాటిని తప్పని సరిగా ప్రోత్సహించాలని సూచించారు. చదువుతోపాటు క్రీడలలోనూ రాణించాలని సూచించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు మెమోంటోలు, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్‌, పాఠశాల డైరెక్టర్‌ రాముడు, ప్రిన్సిపల్‌ సునిత గోన తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ పరిధిలో ఎంబీఏ హెల్త్‌ కేర్‌ మేనేజ్‌మెంట్‌ ప్రవేశ పరీక్ష రాసేందుకు ఆసక్తి గలవారు ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఓపెన్‌ యూనివర్సిటీ సేవా విభాగం డైరెక్టర్‌ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారికి అపోలో, కిమ్స్‌, డెక్కన్‌ మెడికల్‌ కళాశాల తదితర వాటిలో అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉందన్నారు. వివరాలకు అంబేడ్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేడు రాష్ట్రస్థాయి నెట్‌బాల్‌ సెలక్షన్స్‌

మహబూబ్‌నగర్‌ క్రీడలు: జిల్లాకేంద్రంలోని ఇండోర్‌ స్టేడియంలో ఆదివారం రాష్ట్రస్థాయి నెట్‌బాల్‌ సెలక్షన్స్‌ ట్రయల్స్‌ నిర్వహిస్తున్నట్లు నెట్‌బాల్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ తెలంగాణ అధ్యక్షుడు విక్రమ్‌ ఆదిత్యరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న జాతీయస్థాయి నెట్‌బాల్‌ టోర్నమెంట్‌లకు సంబంధించి రాష్ట్ర జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రం నమక్కల్‌లో ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే 17వ సౌత్‌జోన్‌ నేషనల్‌ నెట్‌బాల్‌, ఇదే వేదికలో 18, 19 తేదీల్లో జరిగే 2వ ఫాస్ట్‌5 సౌత్‌జోన్‌ నెట్‌బాల్‌ చాంపియన్‌షిప్‌, 19, 20 తేదీల్లో జరిగే మొదటి సౌత్‌జోన్‌ నేషనల్‌ మిక్స్‌డ్‌ పోటీలు, హర్యానా రాష్ట్రం పల్వాల్‌లో వచ్చే నెల 28 నుంచి 31 వరకు నెట్‌బాల్‌ పురుష, మహిళా జట్ల సెలక్షన్స్‌ ట్రయల్స్‌ ఉంటాయన్నారు. సెల్‌ .8883800699ను సంప్రదించాలని కోరారు.

మధ్యాహ్నం వ(మ)ంట

పెరిగిన ధరలతో వంట ఏజెన్సీల అవస్థలు



చాగదోనలో మధ్యాహ్న భోజనం చేయకపోవడంతో టిఫిన్‌ బాక్సులను తెచ్చుకుని తింటున్న విద్యార్థులు

- 4 నెలల మధ్యాహ్న భోజనం బిల్లుల పెండింగ్‌.
- అప్పు చేసి మరీ విద్యార్థులకు వండి పెడుతున్న వైనం
- బయటి ధరలకు అనుగుణంగా బిల్లులు ఇవ్వకపోవడంతో అనాసక్తి

గట్టు: మెనూ తప్పనిసరిగా పాటించాలని.. ఆహార పదార్థాల్లో నాణ్యత ఏమాత్రం తగ్గకూడదని.. వారంలో మూడు రోజులు గుడ్లు ఉండాలని అధికారులు ఆదేశిస్తున్నా.. అందుకు తగ్గట్లుగా ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకపోవడం, ధరల్లో తేడాలు ఉండడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు భోజనం వండేందుకు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు అప్పుల పాలవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేసి అందించే బాధ్యత వంట ఏజెన్సీలకు అప్పగించిన విషయం తెలిసిందే. నాలుగు నెలలుగా బిల్లులు విడుదల కాకపోవడంతో నిర్వాహకులు అప్పులు చేసి విద్యార్థులకు వండి పెడుతున్నారు. ఒకవేళ వంట ఏజెన్సీని కాదనుకుంటే బిల్లుల బకాయిలను వదులుకోవాల్సి వస్తుండడంతో చేసేదేమి లేక వంట ఏజెన్సీలను కొనసాగిస్తున్నారు.

రూ.32 లక్షల బిల్లులు బకాయి

పాఠశాలల్లో గత విద్యా సవంత్సరం ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌ నుంచి ఈ విద్యా సంవత్సరం జూన్‌ నెలకు సంబంధించిన మొత్తం 4 నెలల బిల్లులు సుమారుగా రూ.32 లక్షల దాకా బకాయి పడడంతో వంట ఏజెన్సీలు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో నిత్యావర వస్తువుల ధరలు ఆకాశన్నంటిన తరుణంలో ఏం కొనాలన్నా ఒకటికి రెండు పర్యాయాలు ఆలోచించి తీసుకునే పరిస్థితి ఏర్పడింది. ఆకు కూరలు, కూరగాయల పరిస్థితి వేరే చెప్పనవసరం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం అందిస్తున్న భోజనంలో ఆకు కూరలు, కూరగాయలను ప్రతి రోజు అందించలేక వంట ఏజెన్సీ నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. మార్కెట్‌లో స్థిరంగా లేని ధరల కారణంగా వీరిపై అదనపు భారం పడుతోంది. బిల్లులు చేతికందిన తర్వాత అప్పులను తీర్చుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 275 ప్రాథమిక, 94 ప్రాథమికోన్నత, 83 ఉన్నత పాఠశాలలు మొత్తం 452 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మొత్తం 56,594 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రతి పాఠశాలలో వంట ఏజెన్సీలు కొనసాగుతున్నాయి. ప్రాథమిక పాఠశాలలో వంట సహాయకులు 661, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 528 మంది మొత్తం 1,189 మంది వంట సహాయకులు పని చేస్తున్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి రోజుకి రూ.6.19, 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి రూ.9.29, 9, 10వ తరగతి విద్యార్థికి రూ.11.17 లను ప్రభుత్వం వంట ఏజెన్సీలకు చెల్లిస్తోంది.



గొర్లఖాన్‌దొడ్డి పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

గుడ్డు పరిస్థితి కాస్త మెరుగు

పాఠశాలల్లో తప్పని సరిగా వారానికి మూడు పర్యాయాలు విద్యార్థులకు గుడ్డు అందించాల్సి ఉంటుంది. గతంతో పోల్చుకుంటే గుడ్డు ధర కాస్త మెరుగైనట్లు వంట ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. గతంలో రూ.5 మాత్రమే ఇస్తుండగా మార్కెట్‌లో గుడ్డు రూ.6కు లభించేదని, ఈ ఏడాది ప్రభుత్వం మార్చి నుంచి గుడ్డు ధరను రూ.5 నుంచి రూ.6కు పెంచింది. పెంచిన ధర డబ్బులను ఇంకా వంట ఏజెన్సీలు అందుకోవాల్సి ఉంది. మార్కెట్‌లొ గుడ్డు మాత్రం రూ.7 కు లభిస్తున్నట్లు వారు తెలిపారు. పెరిగిన ధరల నేపథ్యంలో ప్రతి రోజు మెనూ ప్రకారం కూరగాయలు, ఆకుకూరలతో భోజనం అందించడం ఇబ్బందికరంగా మారిందని, ధరలకు అనుగుణంగా ప్రభుత్వం ధరలను సవరించి అందించి ఆదుకోవాలని వంట ఏజెన్సీ నిర్వాహకులు కోరుతున్నారు.

నెలల తరబడి బిల్లుల పెండింగ్‌తో అనాసక్తి

- చాగదోన ప్రాథమిక పాఠశాలలో జులై 2 నుంచి వంట ఏజెన్సీ చేతులెత్తేయడంతో 180 మంది విద్యార్థులు అర్ధాకలితో అలమటించారు. కూలీ పనులు చేసే వారి పిల్లలు మాత్రం ఉదయం టిఫిన్‌ బాక్సులు తెచ్చుకోలేక సాయంత్రం దాకా పస్తులుండి ఇంటి వెళుతున్నారు.
- 200 మంది ఉన్న ఉన్నత పాఠశాలలో కూడా ఇదే మాదిరిగా మూడు రోజులు మధ్యాహ్న భోజనం నిలిచి పోగా, అధికారులు వంట ఏజెన్సీ నిర్వాహాలతో చర్చించి కొనసాగేలా చర్యలు తీసుకున్నారు.
- ఇందువాసి గ్రామంలో అప్పులు చేసి వంట చేయడం మావల్ల కాదని తేల్చి చెప్పారు. వంట ఏజెన్సీ వారితో మాట్లాడి మెనూ ప్రకారం వంట చేసే విధంగా అధికారులు వంట ఏజెన్సీని ఒప్పించారు.

ధరలకు అనుగుణంగా బిల్లులివ్వాలి



మధ్యాహ్న భోజనంలో వారానికి మూడు పర్యాయాలు గుడ్లు అందించాలని అధికారులు చెబుతున్నారు. వంట ఏజెన్సీలకు మాత్రం ప్రభుత్వం గుడ్డుకు ఇచ్చేది రూ.6. బయటి మార్కెట్లో రూ.7కు లభిస్తోంది. కూరగాయల, ఆయిల్‌, పప్పుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులను చెల్లించాలి.
– శేషన్న, వంట కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు

అప్పుల పాలవుతున్నాం..



మధ్యాహ్న భోజనం కోసం అప్పులు చేసి పిల్లలకు వంట తయారు చేసి అందిస్తున్నాం. బకాయిల కారణంగా చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం బకాయిలు లేకుండా నెల నెలా బిల్లులను చెల్లించాలి.
– సరోజమ్మ, వంట ఏజెన్సీ నిర్వాహకురాలు, ఎల్కూరు

త్వరలో బిల్లులు చెల్లిస్తాం..

వంట ఏజెన్సీ నిర్వాహకులు మెనూ ప్రకారం భోజనాన్ని విద్యార్థులకు అందించాల్సిందే. బిల్లులు మంజూరైన వెంటనే ఎంఈఓ ఖాతాల్లో జమ చేసి, వంట ఏజెన్సీలకు అందించేలా, మధ్యాహ్న భోజనం ఎక్కడా నిలిచిపోకుండా ఎంఈఓల ద్వారా చర్యలు తీసుకుంటున్నాం. పెండింగ్‌ బిల్లులను త్వరలోనే చెల్లించే విధంగా చూస్తాం. ఎవరూ ఆందోళన చెందొద్దు.
– అబ్దుల్‌ ఘని, డీఈఓ

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల: జిల్లా కేంద్రంలోని ప్రజలకు మరో 30, 40ఏళ్ల పాటు తాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం కోసం రూ.2కోట్లతో 10లక్షల లీటర్ల వాటర్‌ట్యాంకు నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని దౌదర్‌పల్లి సమీపంలో నూతన వాటర్‌ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమృత్‌ పథకంలో భాగంగా నూతన వాటర్‌ట్యాంకును మంజూరు చేసిందని, వేసవిలో గద్వాల పట్టణవాసులకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు బండారి భాస్కర్‌, రామన్‌గౌడ, వెంకట్రాములు, శ్రీకాంత్‌రెడ్డి, దౌలు, శ్రీమన్నారయణ, కృష్ణ, నాగులు, సోమన్న, ధర్మ నాయుడు, అన్వర్‌, మధు, ప్రవీణ్‌, ఓంప్రకాష్‌ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కేంద్రం పెద్దపీట



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

రాజోళి: బీజేపీ ప్రభుత్వ హయాంలోనే గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులను కేటాయించి గ్రామాలను అభివృద్ధి చేసిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టి. రామాంజనేయులు అన్నారు. శనివారం స్థానిక సంస్థల సన్నాహక సమావేశంలో భాగంగా వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామంలో మండల అధ్యక్షుడు బోయ నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పార్టీలు గ్రామ పంచాయతీల అభివృద్ధిని తుంగలో తొక్కారని అన్నారు. బీజేపీ ప్రభుత్వంలో గ్రామాల్లో వైకుంఠ ధామాలు, సీసీ రోడ్లు, పల్లె ప్రకృతి వనాలు అంగన్‌ వాడీల ఆధునీకరణ కోసం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులను నేరుగా కేటాయించిందని అన్నారు. ఇంత అభివృద్ధి చేసిన బీజేపీ పార్టీకి మాత్రమే స్థానిక సంస్థల్లో ఓటు అడిగే అర్హత ఉందని అన్నారు. 42 శాతం రిజర్వేషన్లను తెరపైకి తెచ్చి మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్‌ ప్రభుత్వం కుట్ర చేస్తుందని అన్నారు. రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో బీజేపీ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్‌, జిల్లా ఉపాధ్యక్షుడు కేకే రెడ్డి,రాష్ట్ర కౌన్సిల్‌ మెంబర్‌ జయలక్ష్మీ, సీనియర్‌ నాయకులు రాజగోపాల్‌, సంజీవ రెడ్డి తదిదరులు పాల్గొన్నారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం

గద్వాలటౌన్‌: కాంగ్రెస్‌ పార్టీ పటిష్టానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని, పార్టీ అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తుందని కాంగ్రెస్‌ పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్‌ కుసుమ కుమార్‌ అన్నారు. శనివారం స్థానిక హరిత టూరిజం హాల్‌లో నిర్వహించిన పార్టీ జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీ విజయానికి, గత ప్రభుత్వంపై పోరాటం చేసిన కార్యకర్తలకు పార్టీ పదవుల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశాలు దక్కుతాయన్నారు. కొత్తగా చేరిన వారికి పదవులిచ్చే ప్రసక్తి లేదన్నారు. కార్యకర్తల శ్రమ ఫలితమంగానే కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిందని, గ్రామ స్థాయి నుంచి పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేసేందుకు ముమ్మర ప్రయత్నం జరుగుతుందన్నారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లా ఉందన్నారు. ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వంద శాతం రుణమాఫీ జరిగిందని, బీఆర్‌ఎస్‌, బీజేపీ అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ సంస్థాగత అంశాలపై నాయకులకు మార్గనిర్దేశం చేశారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్‌ పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్‌ కుసుమ కుమార్‌

సంఘటితంగా పనిచేయాలి : సంపత్‌కుమార్‌
ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు సంఘటితంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మండల, పట్టణ, బ్లాక్‌ కాంగ్రెస్‌ పార్టీ పదవులకు ఆశావహులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయమన్నారు. అయితే ఎమ్మెల్యేతోపాటు ఆయన వర్గీయులు ఎవురూ కూడా సమావేశానికి హాజరు కాలేదు. గైర్హాజరుపై భిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సరిత, జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ శ్రీనివాసులు, మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ బీఎస్‌ కేశవ్‌, జిల్లా యువజన కాంగ్రెస్‌ అధ్యక్షుడు తిరుమలేష్‌, నాయకులు దొడ్డెప్ప, నల్లారెడ్డి, ఇసాక్‌, నారాయణరెడ్డి, సుకన్య, నాగశిరోమణి, గట్టు క్రిష్ణ, గౌస్‌, డీఆర్‌ శ్రీధర్‌, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

జోగుళాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

అలంపూర్‌: దక్షిణ కాశీ అలంపూర్‌ క్షేత్ర ఆలయాలను కాంగ్రెస్‌ పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కుసుమ కుమార్‌, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌ కుమార్‌ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికారు. అనంతరం వారు బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు. ఆలయ అర్చకులు వారిని శేషవస్త్రాలతో సత్కరించారు.

క్రికెట్‌లో మెరుపులు

బ్యాట్‌ పడితే సిక్స్‌.. బంతి విసిరితే బౌల్డ్‌

- అద్భుతంగా రాణిస్తున్న పాలమూరు యువ క్రీడాకారులు
- ఆకాశమే హద్దుగా చెలరేగుతున్న వైనం
- సత్తా చాటుతున్న మహిళా క్రికెటర్లు



పాలమూరు క్రికెట్‌లో యువతరం సత్తా చాటుతోంది. అబ్బాయిలతో పాటు అమ్మాయిలు సైతం దూసుకుపోతున్నారు. బ్యాట్‌తో పరుగుల వరద పారించడంతో పాటు వికెట్లు తీస్తూ ప్రత్యర్థులను హడలెత్తిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ (హెచ్‌సీఏ) సహకారంతో ఎండీసీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఇంట్రా డిస్ట్రిక్ట్‌ క్రికెట్‌ లీగ్‌లో మెరుపులు మెరిపించి..భవిష్యత్‌కు భరోసా నింపుకొన్నారు. పురుషుల అండర్‌-23 టూ డే లీగ్‌, అండర్‌-19 లీగ్‌, మహిళా క్రికెట్‌ లీగ్‌తో పాటు పలు కీలక పోటీల్లో రాణిస్తున్నారు. బ్యాట్‌, బాల్‌లో మెరుపులు మెరిపిస్తున్న వర్ధమాన క్రీడాకారులపై ప్రత్యేక కథనం.
– మహబూబ్‌నగర్‌ క్రీడలు



క్రీడాకారిణుల కరచాలనం

ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్న అబ్దుల్‌ రాఫే



మహబూబ్‌నగర్‌కి చెందిన అబ్దుల్‌ రాఫే బ్యాటింగ్‌తో పాటు కీపర్‌గా రాణిస్తున్నాడు. ఇటీవల జరిగిన ఇంట్రా డిస్ట్రిక్ట్‌ అండర్‌-19 వన్డే క్రికెట్‌లో బ్యాటింగ్‌లో తన నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. గద్వాలపై అబ్దుల్‌ రాఫే అద్భుతమైన బ్యాటింగ్‌తో అజేయ డబుల్‌ సెంచరీ చేశాడు. 173 బంతుల్లో 6 సిక్స్‌లు, 31 ఫోర్లతో 243 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. నారాయణపేటపై 127 బంతుల్లో 3 సిక్స్‌లు, 25 ఫోర్లతో 165 పరుగులు చేశాడు. లీగ్‌లో 495 పరుగులు చేసి బెస్ట్‌ బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. 2023లో టుడే లీగ్‌లో రెండు సెంచరీలు, మూడు అర్ధసెంచరీలు చేశాడు. ఈ ఏడాది చెన్నైలో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ క్రికెట్‌ టోర్నీలో పీయూ తరపున ఆడి రాణించాడు. క్రికెట్‌ అంటే చాలా ఇష్టమని, టీమిండియాకు ఆడాలన్నదే తన కల అని పే అంటున్నాడు అబ్దుల్‌ రాఫే.

బంతితో తిప్పేసిన ముఖితుద్దీన్‌



మహబూబ్‌నగర్‌కు చెందిన ముఖితుద్దీన్‌ లెఫ్ట్‌ ఆర్మ్‌ స్పిన్నర్‌. ఇంట్రా డిస్ట్రిక్ట్‌ అండర్‌-23 టూ డే లీగ్‌లో బంతిని గింగిరాలు తిరిగేలా బ్యాట్స్‌మెన్‌లను బోల్తా కొట్టించారు. తన స్పిన్‌ మాయాజాలంతో టోర్నీలో అత్యధికంగా 34 వికెట్లు తీశాడు. రెండు ఇన్నింగ్స్‌లలో వనపర్తి, నారాయణపేట జట్లపై 10 చొప్పున వికెట్లు, జడ్చర్లపై 5, గద్వాలపై 5, నాగర్‌కర్నూల్‌పై 4 వికెట్లు తీసి రాణించాడు. గతంలో పలుసార్లు హెచ్‌సీఏ టోర్నీల్లో ఎండీసీఏ తరఫున ఆడి ప్రతిభ చాటాడు. 2024లో వరంగల్‌లో జరిగిన హెచ్‌సీఏ అండర్‌-19 టోర్నీలో 5 మ్యాచుల్లో 14 వికెట్లు తీసి ఉత్తమ బౌలర్‌గా నిలిచాడు. ఈ ఏడాది చెన్నైలో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ క్రికెట్‌ టోర్నీలో నాలుగు ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు తీశాడు. గతేడాది త్రీ డే లీగ్‌లో 8 వికెట్లు తీశాడు. భవిష్యత్‌లో రంజీ, భారత జట్టుకు ఆడడమే తన లక్ష్యమంటున్నాడు ముఖితుద్దీన్‌.

'శత'క్కొట్టిన కేతన్‌కుమార్‌



జడ్చర్లకు చెందిన కేతన్‌కుమార్‌ యాదవ్‌ బ్యాటింగ్‌లో సంచలనం సృష్టించాడు. రెండేళ్లుగా క్రికెట్‌లో శిక్షణ తీసుకుంటున్న కేతన్‌ అండర్‌-23 లీగ్‌లో మూడు సెంచరీలు కొట్టి 474 పరుగులు చేసి బెస్ట్‌ బ్యాటర్‌గా నిలిచాడు. వనపర్తితో జరిగిన టూ డే లీగ్‌ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ శతకొట్టి 221 పరుగులు చేశాడు. మొదటి ఇన్నింగ్స్‌లో 113, రెండో ఇన్నింగ్స్‌లో 108 పరుగులు చేశాడు. మహబూబ్‌నగర్‌పై మరో సెంచరీ (101 పరుగులు) చేశాడు. రంజీ జట్టులో చోటు దక్కించుకోవడమే ప్రస్తుత లక్ష్యమంటున్నాడు కేతన్‌కుమార్‌.

బ్యాటింగ్‌లో 'ప్రతీక' ప్రతిభ



మహమ్మదాబాద్‌ మండలం మంగంపేటకు చెందిన ప్రతీక తాండూరులో తొమ్మిదో తరగతి చదువుతోంది. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఇంట్రా డిస్ట్రిక్ట్‌ వుమెన్స్‌ క్రికెట్‌ లీగ్‌లో పాల్గొని ప్రతిభచాటింది. వికెట్‌ కీపర్‌గా, బ్యాటింగ్‌లో రాణిస్తోంది. హైదరాబాద్‌లోని కేఎస్‌ఎం క్లబ్‌లో రెండేళ్లుగా శిక్షణ తీసుకుంటున్న ప్రతీక గత ఏడాది అండర్‌-15 టోర్నీలో హెచ్‌సీఏ జట్టు తరఫున తమిళనాడు, ఆంధ్ర జట్లతో మ్యాచ్‌లు ఆడింది. మొదటిసారిగా ఉమ్మడి జిల్లాలో వుమెన్‌ క్రికెట్‌ లీగ్‌ నిర్వహించడం సంతోషంగా ఉందని, క్రికెట్‌లో ప్రతిభ కనబరిచి భారత జట్టు ఆడాలన్నదే తన లక్ష్యమంటోంది ప్రతీక.

బెస్ట్‌ బౌలర్‌గా దివ్యరాథోడ్‌



వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మామిడిమాడకు చెందిన దివ్యరాథోడ్‌ ఇటీవల ఇంట్రా డిస్ట్రిక్ట్‌ వుమెన్‌ క్రికెట్‌ లీగ్‌లో బెస్ట్‌ బౌలర్‌గా ఎంపికైంది. రెండు లీగ్‌ మ్యాచుల్లో 7 వికెట్లు తీసి ప్రతిభచాటింది. వనపర్తిలోని గిరిజన గురుకులంలో చదువుతున్న దివ్యరాథోడ్‌ కోచ్‌ మన్నాన్‌ వద్ద రెండేళ్లగా క్రికెట్‌లో శిక్షణ తీసుకుంటోంది. గత ఏడాది ఖమ్మంలో జరిగిన స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ అండర్‌-17 రాష్ట్రస్థాయి, హరియాణాలో జరిగిన జాతీయస్థాయి మహిళా క్రికెట్‌ టోర్నీలో ఆడింది. ఫాస్ట్‌బౌలర్‌గా గుర్తింపు పొంది జాతీయ మహిళా జట్టుకు ఎంపికవుతానని అంటోంది దివ్యరాథోడ్‌.

కెప్టెన్‌గా రాణించిన అనిత



నారాయణపేట జిల్లా కోస్గి మండలం హన్మాన్‌పల్లికి చెందిన అనిత ఇంట్రా డిస్ట్రిక్ట్‌ వుమెన్‌ లీగ్‌లో రెడ్‌ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి జట్టును ముందుకు నడిపించి చాంపియన్‌గా నిలవడంలో తన వంతు పాత్ర పోషించారు. రెండు మ్యాచుల్లో 59 పరుగులు చేయడంతో పాటు 4 వికెట్లు తీసింది. వనపర్తిలోని గిరిజన సొసైటీ క్రికెట్‌ అకాడమీలో శిక్షణ పొందుతూ ఆల్‌రౌండర్‌గా రాణిస్తోంది. ఎస్‌జీఎఫ్‌ జాతీయస్థాయి క్రికెట్‌ టోర్నీలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించింది. 2021లో హెచ్‌సీఏ మహిళా జట్టుకు ఎంపికై సూరత్‌ టోర్నీలో ఆడింది. హెచ్‌సీఏ టోర్నీల్లో రాణించి భారత జట్టుకు ఎంపికకవుతానని ధీమా వ్యక్తం చేస్తోంది అనిత.

క్లుప్తంగా

కృష్ణానదిలో పడి వృద్ధురాలి మృతి



ఎర్రవల్లి: ప్రమాదవశాత్తు కృష్ణానదిలో జారి పడి వృద్ధురాలు మృతిచెందిన ఘటన ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్ వివరాల మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన మాలే భారతమ్మ (69) తరచుగా దైవదర్శనం కోసం బీచుపల్లికి వచ్చేది. ఈ క్రమంలో శనివారం ఉదయం బీచుపల్లికి వచ్చిన ఆమె.. కృష్ణానది వద్ద కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో జారిపడింది. నదిలో కొట్టుకుపోతున్న వృద్ధురాలిని గమనించిన జాలర్లు పుట్టీల సహాయంతో ఒడ్డుకు చేర్చారు. అనంతరం చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. పరిస్థితి విషమించి మార్గమధ్యంలో మృతిచెందింది. మృతురాలి కుమారుడు వేణుగోపాల్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం

ధన్వాడ: మండలంలోని రామకిష్టాయిపల్లి శివారులోని మాద్వార్ ఎక్స్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఊట్కూర్ మండలం నిడుగుర్తికి చెందిన కొల్లూరు శంకరప్ప తన కుమారుడు ఘనరాజ్(6)తో కలిసి కిష్టాపూర్ వైపు బైక్‌పై వెళ్తుండగా.. చర్లపల్లి నుంచి మరికల్‌కు వెళ్తున్న ఆటో ఎక్స్‌రోడ్డు వద్ద ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. బైక్ ముందుభాగంలో కూర్చున్న ఘనరాజ్ ఆటో ముందు భాగానికి తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి శంకరప్పకు గాయాలు కావడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

భూత్పూర్: మండలంలోని పోతులమడుగు జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. పోతుమడుగు గ్రామ పంచాయతీలోని అనుబంధ గ్రామమైన గోపన్నపల్లికి చెందిన టి.కురుమూర్తి (45) పోతులమడుగు నుంచి భూత్పూర్ వైపు వెళ్లడానికి నడుచుకుంటూ వెళ్తుండగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో కురుమూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న భూత్పూర్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

కోలాటం పంతులుకు అవార్డు




అవార్డు అందుకుంటున్న కోలాటం పంతులు రాజశేఖర్

మన్ననూర్: నల్లమల ప్రాంతంలో కోలాటం పంతులుగా పేరు పొందిన దాసరి రాజశేఖర్ కళా రంగంలో జాతీయ పురస్కారం అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభ వేదికగా తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు వెలుగు మహానంది అవార్డుల ప్రదానోత్సవంలో రాజశేఖర్‌కు నంది అవార్డు, ప్రశంసా పత్రం అందజేశారు. కోలాటం కళా రంగంలో రాజశేఖర్ ఎనిమిదేళ్లుగా మహిళలకు కళా ప్రదర్శన నేర్పించడంతో పాటు అనేక ప్రాంతాల్లో కోలాటం ప్రదర్శనలు ఇచ్చారు. పూర్తిగా పల్లె వాతావరణం ఉట్టిపడే విధంగా ఉండే ఈ కళా రంగానికి ఆయన చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ అవార్డును ప్రదానం చేశారు. కాగా, ఈ కళను రాజశేఖర్ వారసత్వంగా అందిపుచ్చుకున్నారు. అతడి తాత దాసరి రామయ్య యక్షగానం కళారంగంలో నిష్ణాతుడు. తండ్రి దాసరి వెంకటేశ్వర్లు స్టేజీ నాటకాల కళాకారుడిగా, పంతులుగా రాణించారు. అదే క్రమంలో రాజశేఖర్ మున్ముందు అత్యుత్తమ ప్రతిభకనబరిచి మరిన్ని అవార్డులు అందుకోవాలని తోటి కళాకారులు, గ్రామస్తులు ఆకాంక్షించారు.

పెద్దగుట్ట ముస్తాబు

పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కోనేరుకు పూర్వవైభవం



జడ్చర్లలోని పెద్దగుట్ట, గుట్టపై కొలువుదీరిన రంగనాథస్వామి (ఇన్‌సెట్‌లో)

- భక్తుల సౌకర్యార్థం షెడ్ నిర్మాణం
- ఐమాస్ట్ లైట్లు, సీసీ కెమెరాల ఏర్పాటు

జడ్చర్ల టౌన్: పుర పరిధిలోని పాతబజార్‌లో ఉన్న పెద్దగుట్టను శ్రావణమాస ఉత్సవాలకు ముస్తాబు చేస్తున్నారు. గతేడాది శ్రావణ మాసంలో ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన లక్ష అడుగులు కార్యక్రమం జయప్రదం కావడంతో ఈసారి మరింత మంది భక్తులను రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వెయ్యేళ్ల చరిత్ర ఉన్న పెద్దగుట్ట 750 అడుగుల ఎత్తులో ఉండటంతో పాటు పైభాగాన ఏడున్నర ఎకరాల విశాల మైదానం ఉంది. గుట్టపై లక్ష్మీ సమేత రంగనాథస్వామి స్వయంభువుగా వెలిశారని ప్రతీతి. గుట్టపై ఉన్న ఆలయాన్ని ధ్వంసం చేసేందుకు పలుమార్లు యత్నించారు. ఆలయానికి పైకప్పు లేకపోవడంతో వేసేందుకు యత్నించినా విఫలం కావడంతో అలాగే కొలుస్తున్నారు. తెలుగులో తొలి రామాయణాన్ని ఈ ప్రాంతానికి చెందిన గోన బుద్దారెడ్డి గుట్టపై రంగనాథస్వామి స్ఫూర్తితో ఎక్కువ భాగం గుట్టపైనే రాశారని తెలుస్తోంది.

రూ.లక్షలతో పునరుద్ధరణ..

ఆలయం ఎదున రాళ్ల నడుమ కోనేరు వెలిసింది. దీనిని అభివృద్ధి పేరిట కొందరు గతేడాది పూడ్చివేశారు. శ్రావణమాస ఉత్సవాలకు సిద్ధమవుతున్న వేళ కోనేరు పూడ్చివేయడం పట్టణంలోని ప్రతి ఒక్కరినీ ఆగ్రహానికి గురిచేసింది. దీంతో ఆలయానికి పరిరక్షణ కమిటీని నియమించి రూ.లక్షలు వెచ్చించి కోనేరుకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. పునరుద్ధరించిన కోనేరులో ఇప్పుడిప్పుడే ఊట మొదలు కావడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి దంపతులు అన్నీ తామై ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

చోరీల నియంత్రణకు..

గుట్టపై ఉన్న ఐమాస్ట్ లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో దొంగల బెడద తగ్గింది. అదేవిధంగా ఐమాస్ట్ లైట్లు ఆలయం నలువైపులా ఏర్పాటు చేయడంతో పాటు భక్తుల సౌకర్యార్థం పెద్ద షెడ్ నిర్మాణం చేపడుతున్నారు. శ్రావణమాసం ప్రారంభం నాటికి షెడ్ సిద్ధం కానుంది. భక్తులు వ్రతాలు చేసుకునేందుకు, వర్షాలకు తలదాచుకోవడానికి అనువుగా మారనుంది. వంటలు చేసుకుని సేద తీరేందుకు సైతం సౌకర్యం కానుంది.

భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు..

శ్రావణమాసంలో గుట్టపైకి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. రూ.లక్షలు వెచ్చించి కోనేరుకు పూర్వ వైభవం తీసుకొచ్చాం. ఐమాస్ట్ లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. అలాగే షెడ్ నిర్మాణం చేస్తున్నాం. గతేడాది లక్ష అడుగులు అంటూ లక్షలాది మంది భక్తులను గుట్టపైకి రప్పించాం. ఈ పర్యాయం అదేవిధంగా శ్రావణమాస ఉత్సవాలు జయప్రదం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం.

– కాల్వ రాంరెడ్డి, అధ్యక్షుడు, రంగనాథస్వామి ఆలయ పరిరక్షణ కమిటీ



కొనసాగుతున్న షెడ్ నిర్మాణం



కోనేరు

జూరాల వద్ద కృష్ణమ్మ పరుగులు

- 10 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- 11 యూనిట్లలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



జూరాల ప్రాజెక్టు వద్ద 10 క్రస్టు గేట్ల నుంచి దిగువకు పారుతున్న వరద

ధరూరు: ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలతో జూరాల ప్రాజెక్టుకు లక్షా 8వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం లక్షా 9వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శనివారం రాత్రి 8 గంటల వరకు లక్షా 8వేల క్యూసెక్కులకు చేరినట్లు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 10 క్రస్టు గేట్లను ఎత్తి గేట్ల ద్వారా 68,640 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 31,487 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్టు-1కు 650, ఆవిరి రూపంలో 44, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 470, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 800, భీమా లిఫ్టు-2కు 750.. ప్రాజెక్టు నుంచి మొత్తం 1.04లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.222 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలాఉండగా, ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గిందని, ఆల్మట్టికి వరద జోరు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఆల్మట్టి ప్రాజెక్టుకు పూర్తి స్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో 90.598 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో 27.133 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 5 గేట్లను ఎత్తి ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న జూరాలకు ప్రాజెక్టుకు 22వేల 230 క్యూసెక్కుల నీటిని దగువకు విడుదల చేస్తున్నారు.

జూరాలను సందర్శించిన మాజీ మంత్రి

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును మాజీ మంత్రి డీకే సమర సింహారెడ్డి శనివారం సందర్శించారు. వరద ప్రవాహాన్ని పరిశీలించి ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలను పీజేపీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గేట్ల వద్ద తెగిన రోప్‌లకు సంబంధించిన, జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సుంకేసులకు స్వల్పంగా తగ్గిన ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసులలో శుక్రవారం 13 గేట్ల ద్వారా నీటి విడుదల జరగగా.. శనివారం స్వల్పంగా ఇన్‌ఫ్లో తగ్గడంతో 10 గేట్ల ద్వారా నీటి విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఎగువ నుంచి 39,540 క్యూసెక్కులు రాగా.. అంతే స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

శ్రీశైలం జలాశయానికి తగ్గిన వరద

దోమలపెంట: శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద కొంత మేర తగ్గుముఖం పట్టింది. శనివారం తెరిచి ఉంచిన మూడు గేట్లలో రెండు గేట్లను మూసివేశారు. ప్రస్తుతం జూరాలలో స్పిల్‌వే ద్వారా 68,640 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 31,487, సుంకేసుల నుంచి 39,170 మొత్తం 1,39,297 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం వస్తున్నాయి. శ్రీశైలం ఒక్క గేటు ద్వారా 27,157 క్యూసెక్కులు, భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 33,062 మొత్తం 95,354 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా పోతిరెడ్డిపాడు నుంచి 20,000క్యూసెక్కులు, ఎంజీకేఎల్‌ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.436 మి.యూనిట్లు, ఏపీజెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 17.382 మి.యూనిట్లు విద్యుదుత్పత్తి చేశారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ఎగువ, దిగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతుంది. ఈమేరకు శనివారం 11 యూనిట్ల ద్వార విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వార 195 మెగావాట్లు, 112.287 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 133.126 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 245.413 ఎంయూ విజయవంతంగా విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు. ప్రస్తుతం 30 వేల క్యూసెక్కులను వినియోగించి విద్యుదుత్పత్తిని చేపడుతున్నామని తెలిపారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



స్థానికులతో వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

జడ్చర్ల: అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం బాదేపల్లిలోని త్రిశూల్‌నగర్‌లో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ముందుగా పోలీసులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. సరైన పత్రాలు లేని 16 ద్విచక్రవాహనాలను స్వాధీనపర్చుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి అద్దెకు వచ్చే వారి ఆధార్ తదితర గుర్తింపు కార్డులు తీసుకుని ఇళ్లను అద్దెకు ఇవ్వాలన్నారు. అలాగే గంజాయి, ఇతర మత్తు పదార్థాల బారిన పడవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత ఫోన్ కాల్స్ మాట్లాడవద్దని సూచించారు. ఎవరికీ ఓటీపీలు చెప్పవద్దని, మహిళలను వేధింపులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపద సమయంలో 100 డయల్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. స్వాధీనపర్చుకున్న వాహనాలకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు చూపిస్తే తిరిగి ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, సీఐ కమలాకర్, ఎస్‌ఐలు జయప్రసాద్, ఖాదర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో 20 కేజీల చేప లభ్యం



కృష్ణానదిలో ఓ మత్స్యకారుడికి 20 కేజీల భారీ చేప దొరికింది. ఉండవెల్లి మండలం మారమూనగాలలో కృష్ణానదిలో గత కొన్ని రోజులుగా మత్స్యకారులు చేపలు పడుతున్నారు. ఈక్రమంలో శనివారం జాలరి వెంకట్రాముడి వలలో 20 కేజీల భారీ బొచ్చ చేప పడింది. ఇంత పెద్ద చేపను చూసేందుకు గ్రామస్తులు ఆసక్తి కనబర్చారు. ఇదిలాఉండగా, ఈ చేప రూ.6వేలు ధర పలకడంతో జాలరి సైతం సంతోషం వ్యక్తం చేశాడు.

– మానవపాడు

మక్తల్‌లో 12 తులాల బంగారం చోరీ



అయిజలో చోరీకి గురైన దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

మక్తల్: గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంటి తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడిన ఘటన పట్టణంలోని టీచర్ కాలనీలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టీచర్ కాలనీకి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి తన బంధువుల్లో ఒకరికి నారాయణపేట ఆస్పత్రిలో కాన్పు కావడంతో వారిని చూసేందుకు శుక్రవారం 2 గంటలకు బయలుదేరి వెళ్లారు. అక్కడే ఒక్కరోజు రాత్రికి ఉండి.. శనివారం మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చారు. అప్పటికే ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసి లోపలికి వెళ్లారు. బీరువా తెరిచి ఉండడంతో పాటు బట్టలు, వస్తువులు చిందరవందరగా పడ్డాయి. బీరువాలో 12 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ.30 వేల నగదును దొంగలు దోచుకెళ్లారని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సీఐ రాంలాల్, ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి అక్కడికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూటీం సభ్యులను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రూ.12 లక్షల విలువైన సిగరెట్ బాక్స్‌ల చోరీ

అయిజ: పట్టణ సమీపంలో పులికల్ రోడ్డు పక్కన ఉన్న విజయలక్ష్మి ఏజెన్సీలో శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. దుండగులు షాపు తలుపు పగులగొట్టి 20 కాటన్ల సిగరెట్ బాక్సులను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా నలుగురు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తెలిసిందన్నారు. షాపు యజమాని వినయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

‘కురుమూర్తి’ ఘాట్ రోడ్డు పనులు ముమ్మరం



కురుమూర్తిస్వామి ఆలయం వద్ద కొనసాగుతున్న మట్టి పనులు

చిన్నచింతకుంట: పేదల తిరుపతిగా పేరుగాంచిన అమ్మాపురం కురుమూర్తిస్వామి ఆలయం వద్ద ఎలివేటెడ్ కారిడార్ ఘాట్‌రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. చిన్నచింతకుంట మండలం అమ్మాపురం గ్రామ సమీపంలోని రాములవారి గుట్ట దగ్గర నుంచి శ్మశానవాటిక వరకు కిలోమీటర పొడవున ఇటాచీల ద్వారా రాళ్లను తొలగించి చదును చేశారు. మట్టిని పరిచి రూలర్‌తో తొక్కిస్తున్నారు. ఇదిలాఉండగా, కురుమూర్తి స్వామి గుట్టపై ఆలయ మెట్ల సమీపాన రాజగోపురం నుంచి స్వామి వారి ప్రధాన ఆలయం వరకు మట్టి సేకరణ పనులు చేపట్టారు. మిషన్ల ద్వారా పది మీటర్ల లోతు వరకు డ్రిల్లింగ్ చేసి మట్టిని సేకరించి ల్యాబ్ టెస్టింగ్‌కు తరలిస్తున్నారు. మట్టి స్వభావం నేల స్థితిగతులు తెలుసుకునే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు.



కురుమూర్తి గుట్టపై డ్రిల్లింగ్ మిషన్ ద్వారా మట్టిని సేకరిస్తున్న సిబ్బంది.

కల్లు దుకాణాలు, డిపోలపై పోలీసుల దాడులు

- సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు..
- నారాయణపేట జిల్లాలో 14 కేసులు నమోదు
- కల్లు శాంపిళ్ల సేకరణ, ఎఫ్‌ఎస్‌ఎల్ ల్యాబ్‌కు సీసాలు
- ఆకస్మిక దాడులతో కంగుతిన్న విక్రయదారులు

నారాయణపేట: హైదరాబాద్ కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనతో రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్పీ యోగేశ్‌గౌతమ్ దిశానిర్దేశంతో జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కల్లుదుకాణాలు, డిపోలపై శుక్రవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు దాడులు చేపట్టారు. కల్తీకల్లు నివారణలో భాగంగా కల్లు దుకాణాల్లో విక్రయిస్తున్న కల్లు బాటిళ్లు, డిపోల్లో కలుపుతున్న సీసాలను శాంపిల్‌గా తీసుకొని సీజ్ చేసి ఫోరెన్సిక్ సైన్స్‌ల్యాబ్‌కు పంపించారు.


ఎస్‌ఐలను మార్చుతూ తనిఖీలు

జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న మండలాల్లోని ఎస్‌ఐలను తమ పరిధిలో కాకుండా ఇతర మండలాల్లో తనిఖీ చేపట్టేలా ఎస్పీ ఆదేశించారు. ఎవరెవరూ ఏ మండలానికి వెళ్లాలనేది ఎవరికి వారే నిర్ణయించుకోకుండా డిప్ సిస్టమ్‌తో చీటీలు తీయించి మండలాలను కేటాయించారు. కల్లు దుకణాలపై దాడులకు వస్తున్నట్లు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆకస్మిక దాడులు చేపట్టాలని ఎస్పీ ఆదేశించినట్లు తెలుస్తోంది. ఎస్పీ సూచన మేరకు డీఎస్పీ లింగయ్య పర్యవేక్షణలో జిల్లాలోని ఎస్‌ఐలు తమ పోలీసు బృందాలతో ఆకస్మికదాడులు చేపట్టడంతో కల్లు డిపో యజమానులు, గీత కార్మికులు, దుకణాల విక్రయదారులు ఖంగుతిన్నారు.


జిల్లాలో 14 కేసులు నమోదు

కోస్గి మండలంలో సర్జఖాన్‌పేట్, కోస్గి పట్టణం, మద్దూర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి, మరికల్ పట్టణం, నారాయణపేట మండలంలో జలాల్‌పూర్, నారాయణపేట టౌన్, ఊట్కూర్ మండలంలో పగిడిమారి, మక్తల్ మండలంలో లింగంపల్లి, పంచాలింగాల, మక్తల్ టౌన్, క్రిష్ణ మండలంలో గూడెబల్లూర్, హిందూపూర్, మాగనూర్ మండలంలో ఉజ్జెల్లి, దామరగిద్ద టౌన్ కల్లు దుకణాలు, డిపోలపై దాడులు చేసి కేసులు నమోదు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. జిల్లాలో చేపట్టిన దాడులపై డీఎస్పీ లింగయ్యను సాక్షి వివరణ కోరగా.. జిల్లాలో పోలీసు అధికారుల బృందాలతో దాడులు చేసింది వాస్తవమేనని, శాంపిల్స్ సేకరించి ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. ల్యాబ్ రిపోర్టును బట్టి తదుపరి చట్టరీత్యా చర్యలు ఉంటాయని తెలిపారు.

గర్భిణికి తప్పుడు రిపోర్టు



అయిజలోని జోగుళాంబ డయాగ్నోస్టిక్స్‌లో ఇచ్చిన రిపోర్టు



గద్వాల డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఇచ్చిన రిపోర్టు ఇలా..

డయాగ్నోస్టిక్ సెంటర్‌పై చర్యలు తీసుకుంటామన్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ

అయిజ: మండల కేంద్రంలోని జోగుళాంబ సెంట్రల్ డయాగ్నొస్టిక్స్ నిర్వాహకులు ఓ గర్భిణికి తప్పుడు రిపోర్టు ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మండలానికి చెందిన ఓ గర్భిణి శుక్రవారం అయిజ పీహెచ్‌సీకి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. అయితే ఉమ్మనీరు ఎంత ఉందనే విషయం తెలుసుకునేందుకు స్కానింగ్ చేయించుకోవాలని పీహెచ్‌సీ సిబ్బంది సూచించారు. ఆమె స్థానిక జోగుళాంబ సెంట్రల్ దయోగ్నొస్టిక్స్‌లో పరీక్షలు చేయించుకోగా.. ఉమ్మనీరు (ఏఎఫ్ఐ 3.4 సీ.ఎం.) ఉన్నట్లు రిపోర్టు ఇచ్చారు. ఉమ్మనీరు తక్కువగా ఉండటంతో సాధారణ కాన్పు సాధ్యంకాదని.. సిజేరియన్ చేయాల్సి ఉంటుందని మెడికల్ ఆఫీసర్ విష్ణు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఆ రిపోర్ట్‌పై అనుమానం వచ్చిన జిల్లా ఆస్పత్రి వైద్యులు అక్కడి డయాగ్నొస్టిక్ సెంటర్‌లో సదరు గర్భిణికి మళ్లీ పరీక్షలు చేయించగా.. ఉమ్మనీరు (ఏఎఫ్ఐ 11.12 సీ.ఎం.) ఉన్నట్లు రిపోర్టు వచ్చింది. దీంతో గర్భిణికి సిజేరియన్ చేయడాన్ని వైద్యులు ఉపసంహరించుకున్నారు. అయిజలోని డయాగ్నొస్టిక్ సెంటర్‌లో ఇచ్చిన రిపోర్టు ఆధారంగా అనవసరంగా సిజేరియన్ చేయించుకోవాల్సి వచ్చేదని బాధితులు వాపోయారు. గతంలో కూడా పలుమార్లు తప్పుడు రిపోర్టులు ఇచ్చారని స్థానికులు మండిపడుతున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ సిద్ధప్పను వివరణ కోరగా.. జోగుళాంబ సెంట్రల్ డయాగ్నొస్టిక్స్‌లో గర్భిణికి ఇచ్చిన ఏఐఎఫ్ రిపోర్టు తప్పని తేలిందన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.